క్లుప్తంగా

కూలీలందరికీ ఉపాధి పనులు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ

కోడుమూరు రూరల్: వలసల నివారణలో భాగంగా గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలందరికీ ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తామని ఏపీఓ మోదీన్ బాషా తెలిపారు. మంగళవారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, పనుల వివరాలను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వస్తుందన్నారు. కూలీలంతా నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో పనులు అవసరమైన కూలీలు ముందుకొస్తే పనులు కల్పిస్తామని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్

సి.బెళగల్: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఉదయం మండలంలోని పలు గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. తుంగభద్ర నదీతీర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న పోలకల్ గ్రామానికి చెందిన ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

జీతాలు చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ల వేడుకోలు



చిందుకూరు గ్రీన్ అంబాసిడర్లు

గడివేముల: మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో గ్రీన్ అంబాసిడర్లకు పనిచేస్తున్న తమకు పది నెలలుగా జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నడిపి రాజు, శాంత కుమారి, జయరాజులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏడేళ్లుగా పనిచేస్తున్నా అరకొర జీతాలు ఇస్తున్నారని..అది కూడా సక్రమంగా ఇవ్వడం లేదని తెలిపారు. పది నెలలుగా జీతాలు మంజూరు చేయకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని వాపోయారు. బకాయి వేతనాలు విడుదల చేస్తే ఉద్యోగాలకు రాజీనామా చేస్తామని పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

బ్యాంక్ మేనేజర్‌కు సన్మానం



సుదర్శన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కల్లూరు: మండల పరిధిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా చిన్నటేకూరు బ్రాంచ్ మేనేజర్ సుదర్శన్ కుమార్ బదిలీ అయ్యారు. మంగళవారం బ్యాంక్ పరిధిలోని బస్తిపాడు, తడకనపల్లె, చిన్నటేకూరు వివిధ గ్రామాలకు చెందిన రైతులు, పొదుపు సంఘాల మహిళలు, డీఆర్‌డీఏ వీఓఏలు, బ్యాంక్ సిబ్బంది ఆయన్ను సత్కరించి ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే నూతన బ్యాంక్ మేనేజర్ హనుమేష్‌కు స్వాగతం పలికారు.

షాప్‌లో అగ్నిప్రమాదం



గడివేముల: మండలంలోని బిలకలగూడురు ఎస్సీ కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న ఓ కిరాణం దుకాణంలో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నాగేషులు కొంత కాలంగా కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు తన షాపుకు నిప్పుపెట్టడంతో వస్తుసామగ్రి కాలిపోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రూ.30 వేలు నష్టం జరిగినట్లు వాపోయాడు.

పోక్సో కేసు నమోదు

డోన్ టౌన్ : మైనర్ బాలికను ప్రేమ పేరుతో యువకుడు లైంగికదాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి నిందితునిపై అత్యాచారం, పోక్సో, కిడ్నాప్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేశారు. పట్టణంలోని కొండపేటకు చెందిన యువకుడు నాసీర్ (19) చిగురమానుపేటకు చెందిన ఒక మైనర్ బాలికను రెండేళ్లుగా ప్రేమిస్తున్నట్లు నమ్మించి ఈనెల 1వ తేదీ లైంగికవాంఛ తీర్చుకుని మంగళవారం ఇంటి వద్ద వదిలేశాడు. బాధితురాలి తల్లి గట్టిగా నిలదీయగా బాలిక అసలు విషయం చెప్పింది.

వ్యవ‘సాయం’ ఏదీ?

- కొత్త ప్రభుత్వంలో అందని పెట్టుబడి సాయం
- ఇంకా ప్రకటన చేయని రాష్ట్ర సర్కారు
- రైతులకు తప్పని ఎదురు చూపులు
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ
- ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్న చంద్రబాబు
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు వైఎస్సార్ రైతు భరోసా

ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఏటా సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయంగా రైతు భరోసా నగదు క్రమం తప్పకుండా అందించింది. కొత్త ప్రభుత్వంలో ఇంత వరకు సాయంపై ప్రకటన చేయలేదు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ పథకం నుంచి తొలి విడత సాయం రూ.2 వేలు చొప్పున రైతు ఖాతాల్లో పడింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా సాయం కోసం అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

గడివేముల: మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. రైతులు ఖరీఫ్ సాగును ప్రారంభించారు. చాలా మంది దుక్కులు దున్ని పొలాలను సిద్ధం చేసి సేద్యాన్ని చేపట్టారు. ఇప్పటికే మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 22 వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు మొదలైంది. ఈ పరిస్థితుల్లో వీరికి కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నుంచి తొలి విడత సాయం విడుదల చేసింది. ఈనెల 18వ తేదీ రైతుల ఖాతాలకు రూ.2 వేల చొప్పున జమ చేసింది. ఈ మొత్తం ఎరువులు, విత్తనాల కొనుగోలుకు కాసింత సహాయ పడనుంది. రూ.2 వేలు కేంద్ర ప్రభుత్వం వాటా కాగా రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

గత ప్రభుత్వంలో ఇలా..

రైతులు పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందిస్తూ అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందిస్తూ వచ్చింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 మొత్తం కలిపి ఏడాదికి రూ.13,500 రైతు ఖాతాలకు జమ చేసింది. ఈ మొత్తాన్ని మూడు విడతల్లో రైతు ఖాతాలకు జమ చేసేది. అందులో ఖరీఫ్ ఆరంభంలో మొదటి విడత, కోతల సమయంలో రెండో విడత, ధాన్యం ఇంటికి చేరే వేళ మూడో విడత ఇలా రైతుల ఖాతాలకు జమ చేసేది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ ద్వారా సాయాన్ని ఐదేళ్లపాటు అందించింది.

కౌలు రైతులకూ భరోసా

ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు అటవీ, దేవదాయ భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు కూడా వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించింది. ఏటా పీఎం కిసాన్ తొలివిడత సాయం విడుదల చేసేది. దీంతో పాటే వైఎస్సార్ రైతు భరోసా పేరిట అప్పటి రాష్ట్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి మొత్తం రూ.7,500 సాయాన్ని కౌలు రైతుల ఖాతాలకు క్రమం తప్పకుండా జమ చేసింది.

మండలంలో 7,165 మంది అర్హులు

మండలంలోని 14 ఆర్బీకేలలో రైతు భరోసా నగదుకు 7,165 మంది రైతులు అర్హులుగా ఉన్నారు.



ఖరీఫ్ సీజన్‌లో పొలాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతు

కరిమద్దెల 943 మంది, కొరటమద్ది 280, కొర్రపోలూరు 650, గడిగరేవుల 539, గడివేముల 358, గని 722, చిందుకూరు 836, చెనకపల్లె 676, తిరుపాడు 278, దుర్వేశి 252, పెసరవాయి 485, బిలకలగూడూరు 543, బూజునూరు 453, మంచాలకట్ట 158 మంది అన్నదాలు ఉన్నారు.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపు

ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఖరీఫ్ పనులను ముమ్మరం చేశారు. దుక్కులు దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం, నారుమడుల తయారీకి నగదు అవసరమవుతున్నాయి. ప్రస్తుతం కేవలం రూ.2 వేలు పీఎం కిసాన్ నిధులు మాత్రమే అందడంతో ఈ డబ్బులు ఎటూ చాలవని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని టీడీపీ, జనసేన ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు, ఉపముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ కొలువుదీరారు, మంత్రులతో తొలి క్యాబినెట్ భేటీ కూడా ముగిసింది. అయినా రైతుల పెట్టుబడి సాయంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గూడూరు రూరల్: గూడూరు సబ్ స్టేషన్‌లోని 132–33 కేవీ ట్రాన్స్‌కోలో కొత్త లైన్ల పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని డిప్యూటీ ఈఈ జేసస్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు మండలాల పరిధిలోని 33–11 కేవీ సబ్‌స్టేషన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వ్యవసాయానికి 3 ఫేస్ విద్యుత్‌ను ఉదయం 8 గంటల వరకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు. రైతులు, వ్యాపారులు, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఉదయం 8 నుంచి 2 గంటల వరకు..

సి.బెళగల్: మండలంలో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ ఏఈ సుకుమార్ తెలిపారు. గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో కొత్తలైన్ల పనులు జరుగుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు, రైతులు, వ్యాపారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

సుంకేసుల రిజర్వాయర్‌కు 260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌కు ఎగువ నుంచి 260 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని మంగళవారం డ్యాం జేఈ రాజు తెలిపారు. కేసీ కెనాల్‌కు 256 క్యూసెక్కులు విడుదల చేశామని, ప్రస్తుతం 1.235 టీఎంసీల నీటితో రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నిండుగా ఉందని పేర్కొన్నారు.

జాగ్రత్తలు పాటిస్తే డయేరియా దూరం



డయేరియాపై అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు



గడివేముల: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జగదీష్ చంద్రారెడ్డి

కోడుమూరు రూరల్: ముందు జాగ్రత్త చర్యలు పాటిస్తే డయేరియా బారిన పడకుండా ఉండొచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సూచించారు. మంగళవారం కోడుమూరులో వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న స్టాప్ డయేరియా– డెంగీ వ్యతిరేక కార్యక్రమాలను పరిశీలించారు. నీటి కలుషితం వల్ల డయేరియా ప్రబలుతున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని తెలిపారు. అలాగే వైద్య సిబ్బంది కూడా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ వెళ్లి డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులను ముందు జాగ్రత్తగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ఎవరైనా అనారోగ్యంతో బాధపడుతుంటే వెంటనే వైద్య చికిత్స అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మధనొశేఖర్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్లు ఉమాభాయి, కమాల్ సాహెబ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన అవసరం

గడివేముల: ఆశా వర్కర్లు డయేరియా నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నంద్యాల జిల్లా ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం గడివేముల ప్రాథమిక వైద్య కేంద్రంలో ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో డయేరియా వ్యాధి ప్రబలుతున్నందున ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని వేడిచేసి చల్లారిన తర్వాత తాగాలని.. ఆహార పదార్థాలను అప్పటికప్పుడు వండుకుని తినాలని సూచించారు. భోజనానికి ముందు తర్వాత చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు ఉంటే స్థానిక పీహెచ్‌సీలో డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో పాటు జాగ్రత్తలు పాటించే విధంగా చూడాలని ఆదేశించారు. పాత ప్లాస్టిక్ వస్తువులను ఇళ్ల పరిసరాల్లో ఉంచకుండా చూడాలన్నారు. దీని వల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నారని.. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తలముడిపి మెడికల్ ఆఫీసర్ మద్దిలేటి, ఎంపీహెచ్ఈఓ మహేశ్వర్ రెడ్డి, పీహెచ్ఎన్ పాలేశ్వరమ్మ, ఎంపీహెచ్ఎస్ మనోహర్, ఫార్మసిస్ట్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

బోధనోపకరణాలపై ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర పరిశీలకురాలు శారదాదేవి

కల్లూరు: ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధించేటప్పుడు తప్పనిసరిగా బోధనోపకరణాలు ఉపయోగించాలని సాల్ట్ ప్రోగ్రామ్ రాష్ట్ర పరిశీలకురాలు వి.శారదా దేవి అన్నారు. ఈ నెల 1 నుంచి 10 తేదీ వరకు కల్లూరు మండలం పెద్దపాడులోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఏపీ సమగ్ర శిక్ష, ఎస్సీఆర్టీ ఆధ్వర్యంలో బోధనోపకరణాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మంగళవారం శిక్షణ కార్యక్రమాన్ని శారదా దేవి పరిశీలించారు. సీ.బెళగల్, గూడూరు, కల్లూరు, కోడుమూరు, క్రిష్ణగిరి, కర్నూలు, ఓర్వకల్లు, వెల్దుర్తి మండలాల పరిధిలో ఎంపిక చేసిన ఉపాధ్యాయులు శిక్షణలో భాగస్వాములు కావాలని తెలిపారు. శిక్షణ అనంతరం నిర్వహించే టీచ్ ప్రైమరీ, టీచ్ సెకండరీ పరీక్షల్లో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలన్నారు. తద్వారా ఎంపిక చేసిన ఎనిమిది మండలాల పరిధిలోని 188 మంది టీచ్ అబ్జర్వర్లు తయారు అవుతారన్నారు. కె.ప్రవీణ్‌కుమార్, ఎస్.మహబూబ్ బాషా, బి.బాల తిమ్మారెడ్డి, వెంకటరాముడు, సుజాత, రమేష్, శేఖన్న, ఏక్‌నాథ్ మాస్టర్ ట్రైనర్‌లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

మద్దూరులో వ్యక్తి దారుణహత్య

- కత్తులు, కొడవళ్లతో వెంటాడి హతమార్చిన దుండగులు
- తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఇటీవల గ్రామానికి వచ్చిన మృతుడు



హత్యకు గురైన దూదేకుల పెద్ద దస్తగిరి

పాణ్యం: మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో వ్యక్తిని వెంటాడి కత్తులతో హతమార్చిన ఘటన మంగళవారం కలకలం రేపింది. ఎస్ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దూదేకుల ఉసేనమ్మ కుమారుడు దూదేకుల పెద్ద దస్తగిరి (50) మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. స్వగ్రామం మద్దూరు అయినా జీవనోపాధి, చిన్న గొడవల కారణంగా బేతంచెర్ల మండలం అంబాపురంలో నివాసం ఉంటున్నాడు. తల్లి ఉసేనమ్మకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో వారం క్రితం గ్రామానికి వచ్చి తల్లికి చికిత్స చేయిస్తున్నాడు. దస్తగిరి ఇంటి వద్ద ఉన్నాడని తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన వడ్డే రామాంజనేయులు, మరో ముగ్గురు కారులో వచ్చారు. ఇంటి సమీపంలో దిన్నెపై కుర్చొని ఉన్న దస్తగిరిని కత్తులు, కొడవళ్లతో వెంటాడి హత్య చేశారు. అనంతరం అదే కారులో పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల, గొంతు భాగాల్లో గాయాలను గుర్తించారు. హత్యకు గల కారణాలపై విచారణ చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య ఫాతిమా, కొడుకు, కుమార్తె ఉన్నారు. ప్రశాంతంగా ఉన్న మద్దూరులో హత్య జరగడంతో ఒక్కసారిగా ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



కేజీబీవీలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ జ్యోతి

సి.బెళగల్: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో మంగళవారం ఎంఈఓ జ్యోతి తనిఖీ చేశారు. విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

11 ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు (టౌన్) : నగర శివారులోని సుంకేసుల రోడ్డులో ఉన్న సంజీవని ఆసుపత్రి వద్ద మంగళవారం రాత్రి ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిని గుర్తించి 11 ద్విచక్ర వాహనాలతో పాటు ఒక కారును స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కోర్టులో హాజరుపరుస్తామని ట్రాఫిక్ సీఐ గౌతమి వెల్లడించారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం

- నంద్యాల డీఈఓ సుధాకర్‌రెడ్డి
- రూ.14 లక్షల స్కాలర్‌షిప్స్‌ను అందించిన జిందాల్ యాజమాన్యం



జిందాల్ ఫ్యాక్టరీలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తున్న డీఈఓ

గడివేముల: మండల పరిధిలోని బిలకలగూడూరులో ఉన్న జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏటా పదో తరగతి నుంచి పీజీ విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ అందించి ప్రోత్సహించడం అభినందనీయమని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం ఫ్యాక్టరీ ఆవరణలో స్కాలర్‌షిప్స్ పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 76 మంది విద్యార్థులకు రూ.14 లక్షల స్కాలర్ షిప్స్‌ను అందజేశారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిందాల్ యూనిట్ హెడ్ నవనీత్ చౌహాన్, గడివేముల ఎంఈఓ విమల వసుంధర దేవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శైలజ, హెచ్ఎం విక్టర్ ఇమ్మానియేల్, కస్తూర్బా స్పెషల్ అధికారి, సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

4న బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఈనెల 4వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లాస్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫుట్‌బాల్ సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక పోటీల్లో పాల్గొనే బాలికలు 2008, 2009, 2010 సంవత్సరంలో జన్మించిన వారై ఉండాలని తెలిపారు. ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకుని రావాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6, 7, 8 తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 98662 11480 సెల్‌నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

బీఎస్ఎన్ఎల్‌లో పెన్షన్ రివిజన్ వెంటనే చేయాలి



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న పెన్షనర్లు

కర్నూలు(అర్బన్): బీఎస్ఎన్ఎల్‌లో పెన్షన్ రివిజన్‌ను వెంటనే చేయాలని ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్, డీఓటీ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక జీఎం కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ జాయింట్ ఫోరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎ. రామలింగం, ఎల్. విజయభాస్కర్ మాట్లాడుతూ 2017 జనవరి 1వ తేదీ నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉందన్నారు. 2010 అక్టోబర్ 1వ తేదీకి ముందు టెలికాం శాఖలో ఉద్యోగంలో చేరి బీఎస్ఎన్ఎల్‌లో అబ్జార్బ్ అయిన అనంతరం పదవీ విరమణ చేసిన వారికి పెన్షన్ సవరణ జరగాల్సి ఉందన్నారు. ఏడు సంవత్సరాలైనా పెన్షన్‌ను సవరించడంలో కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరి అవలంభిస్తుందన్నారు. కేంద్ర పెన్షనర్ల అసోసియేషన్ పిలుపు మేరకు పలుమార్లు నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, నిరాహార దీక్షలు, పోస్టు కార్డు ఉద్యమాలు చేపట్టామన్నారు. అలాగే సంబంధిత మంత్రులు, ప్రధాన మంత్రికి ఈ మెయిల్ ద్వారా తమ డిమాండ్‌ను పంపినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ సాధనకు దీక్షలు చేసినా, ఫలితం నేటికి దక్కలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కోశాధికారి ఖాజామోదీన్, సహాయ కార్యదర్శి షేక్‌షబ్బీర్, సుంకన్న, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం యాకోబు, రంగయ్య, వెంకటరామిరెడ్డి,వి. వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, శాంతి, అంజనీబాయి పాల్గొన్నారు.

పాఠశాలలో ప్రార్థనా వేదిక నిర్మాణం



గూడూరు బాలికల హైస్కూల్‌లో నిర్మాణంలో ఉన్న ప్రార్థనా వేదిక

గూడూరు రూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ప్రార్థనా వేదిక షెడ్డు నిర్మాణాన్ని చైతన్య యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వర్లు చేపట్టారు. మంగళవారం షెడ్డు పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు షెడ్డు ఏర్పాటుకు రూ. 1.60 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. ప్రస్తుతం షెడ్డు నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావస్తోందని.. ఈ నెలాఖరులోగా ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. చైతన్య యూత్ ద్వారా పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు.

బస్సు నుంచి పడి వృద్ధుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇబ్రహీం

ఆదోని అర్బన్: పెద్దకడబూరు మండలం చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం (60) బస్సు ఫుట్‌బోర్డు నుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. చిన్నతుంబళం గ్రామానికి చెందిన ఇబ్రహీం పని నిమిత్తం ఆదోనికి బయలుదేరాడు. గ్రామంలో బస్సు ఎక్కి సీట్లు ఖాళీ లేకపోవడంతో మెట్లపై కూర్చున్నాడు. బస్సు వెళ్తుండగా అలసటతో కునుకు తీశాడు. కుప్పగల్ గ్రామ సమీపాన రోడ్డుపై పశువులు అడ్డు రావడంతో బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో ఫుట్‌బోర్డుపై నిద్రమత్తులో ఉన్న ఇబ్రహీం పట్టుజారి బస్సు నుంచి కింద పడ్డాడు. గాయాలపాలైన ఇబ్రహీంను బస్సు డ్రైవర్ మహమ్మద్‌ఖాన్, కండక్టర్ గణపతి చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


జాతీయ పోటీలకు రాష్ట్ర రగ్బీ జట్టు




జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్న రాష్ట్ర రగ్బీ మహిళా జట్టు

కర్నూలు (టౌన్): ఈనెల 4 వ తేదీన మహారాష్ట్రలోని ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్ మహిళల రగ్బీ పోటీలకు జట్టును ఎంపిక చేశారు. ఆ వివరాలను రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మంగళవారం వెల్లడించారు. ఎంపికయిన క్రీడాకారులకు ఆయన స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల బాపట్లలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఆంధ్రప్రదేశ్ జట్టుకు ఎంపిక చేసినట్లు చెప్పారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు





రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన తోపుడు బండ్లను స్టేషన్‌కు తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు : ప్రధాన రహదారుల్లో వాహన రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రోడ్డు సైడు వ్యాపారులను ట్రాఫిక్ సీఐ గౌతమి హెచ్చరించారు. రోడ్డు సైడు తోపుడు బండ్లు పెట్టుకుని వ్యాపారాలు సాగిస్తుండటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని వాహనదారుల నుంచి ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం ఉదయం ప్రభుత్వ సుపత్రి నుంచి గాయత్రి ఎస్టేట్ వరకు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోడుపు బండ్లు, మొబైల్ క్యాంటీన్లను స్వాధీనం చేసుకుని కొత్తపేటలోని ట్రాఫిక్ స్టేషన్‌కు తరలించారు. చిరు వ్యాపారులకు ఆమె కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్డు మీద తోపుడు బండ్లు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే కేసులు నమోదు చేసి కోర్టులో హాజరుపరుస్తామని హెచ్చరించారు. ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల ద్వారా జీవనం సాగించాలని సూచించారు. మరోసారి పోలీసు ఆంక్షలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.